


# విడివడి

—తెనాలి సుశీలాదేవి

**హోటల్** చిత్రలో అడుగు పెట్టాను. డెకొలావ్‌తో మెరిసిపోతూ అందంగా, గుండ్రంగా ఉన్న టేబుళ్ళ చుట్టూ నాజూగ్గా, ఫాషనుగా ఉన్న కుర్చీల్లో కూర్చుని ఉన్న జనం కేసి చూశాను. వాళ్ళలో కొందరిని చూస్తూంటే వాళ్ళ సౌందర్యానికి, సొగసుకు, నాజూకుతనానికి ఈ ఫర్నిచర్ తగినట్టుగా లేదు. మల్లె మొగ్గలను తెచ్చి మట్టిబెడ్డలమీద పెట్టినట్టు అనిపించింది. మరి కొందరిని చూస్తే వాళ్ళు ఆసీనులవటమే కాదు—తాకినంతమాత్రాన, వాళ్ళ ఊపిరి తగిలినంత మాత్రాన ఆ ఫర్నిచర్ తమ విలువను కోల్పోతున్నట్లు తున్నట్లు, వాటి అందం మాసిపోతుందేమో నన్నట్లు ఉన్నారు.

చుట్టూ ఒకసారి పరికించి చూసి మేనేజరు వైపు దృష్టి సారించిన నాకు—అతను నన్ను విష్ చేయుటం కనిపించింది. చిరునవ్వుతో తల పంకించాను. రెండు వైపులా ఉన్న టేబుళ్ళను దాటుకుంటూ ఎ. సి. రూమ్‌లోకి అడుగుపెట్టాను. ప్రాణానికి హాయిగా ఉన్నట్టు తోచింది.

ఆ హాల్లో చెరో మూలా కూర్చుని ఊసులాడు కుంటున్న రెండు జంటలు తప్ప మిగత టేబుల్స్ అన్నీ ఖాళీగా ఉన్నాయి.

ఒక టేబిల్ ముందు కూచున్నాను. ఆ రెండు జంటల్లో ఒక జంట నన్ను బాగా ఆకర్షించింది.

ఆ జంటలోని అమ్మాయి ఒక్క మాటలో చెప్పాలంటే మంచులో తడిసిన గులాబిలా ఉంది. మలయమారుతంలా, మల్లెమొగ్గలా మనసుకు హాయిని, కళ్ళకు విందును కలిగిస్తోంది.

ఈ జంట నన్ను ఆకర్షించటానికి ఆ అమ్మాయి అందం మాత్రమే కారణం కాదు. ఆవిడ ఎదురుగా కూర్చుని ఉన్న భర్తో, ప్రియుడో మరి...అతను...

అతను అన్నగానీ, తమ్ముడుగానీ మాత్రం కాదని ఖచ్చితంగా తెలుస్తోంది. ఎందుకంటే ఒకరి నొకరు కళ్ళతో తాగేస్తున్నట్టు చూసుకునే ఆ చూపులు, అవసరం లేకపోయినా అప్పుడప్పుడు టేబిలు మీదికి చేతులు చాపుకుని, అవి కలుపుకుని నలుపుకుంటట...టేబిల్ కింద మోకాళ్ళు తగిలించు కుంటూ—ఈ బాంధవ్యం వేరని, మిగత అన్నింటికన్న ఇది చాలా సన్నిహిత సంబంధం కలిగినవని తెలిసిపోతూనే ఉంది.

అయితే, అతను మాత్రం రూపం దృష్ట్యా ఆ అమ్మాయికి నౌఖరుగా కూడా ఉండతగడు. వేషధారణ మాత్రం ఖరీదైనదిగా ఉంది. ఆకర్షణీయమైన, ఖరీదైన దుస్తులు తొడుక్కున్న ఎలుగుబంటిలా ఉన్నాడు.

హోటల్లోకి అడుగు పెట్టి హాలంతా కలయ జూసిన క్షణంలో నాకు కలిగిన భావన మళ్ళీ ఒక్కసారి తళుక్కుమంది నాలో.

ఆమె సొగసుకు, లాలిత్యానికి ఏమాత్రం తగనట్టు...ఫర్నిచర్ వెలవెల బోతున్నట్టు, సరిగ్గా అందుకు భిన్నంగా అతను ఆ టేబిలుముందు, అందమైన ఆకర్షణీయమైన ఆ కుర్చీల్లో కూర్చో టానికి...కాదు...కాదు తాకటానికి కూడా అనర్హుడైనట్టు.

అలాంటి జంటను ఎన్నుకొన్నందుకు, వెంటబడి ఇలా హోటల్లోకి వచ్చినందుకు పైగా అతనెంతో నవమన్మధుడయినట్టు ఆ కళ్ళలో పిపాసను కనబరచటం, తాళలేనట్టు ఆ కాళ్ళా, చేతులూ అలా తగిలించుకుంటూ తృప్తిపొందటం—ఇవన్నీ నాకు ఆమెమీద కోపం తెప్పించాయి. జాలిని కలిగించాయి. ఈవిడ టేస్ట్ మరీ ఇంత ఛీప్‌గా ఉందేమిటా అనీ అనిపించింది.

సర్వరు మళ్ళీ మళ్ళీ పిలిచినట్టున్నాడు. ఈమారు పిలిచిన పిలుపుతో ఉలిక్కిపడి దృష్టి మరల్చు కున్నాను. మెనూ కార్డు.

నాకేం తినాలని లేదు కానీ, కాలం గడవాలి.

చెప్పి పంపించాను. మళ్ళా నా కళ్ళు ఆ జంట కేసే...

వాళ్ళు నావైపు గమనించటం లేదు గనుక నేను చూడటం నిరభ్యంతరంగా సాగుతోంది.

సర్వరు తెచ్చి పెట్టిన బిరియానీ నోటి కందిస్తూ . . . ఈసారెందుకో ఆ అమ్మాయి నాకేసి చూసింది. చప్పున తల తిప్పుకున్నాను. మునుపట్లా చూడటానికి వీలుపడలేదు.

దృష్టి మళ్ళడంతో ఆ హోటల్లో ప్రవేశించే వరకూ నన్ను తినేసిన ఆలోచనలు, ఈ జంటను గమనించటంలో ఇంతసేపూ మరుగుపడిపోయిన సమస్యలు నన్ను మళ్ళీ చుట్టుముట్టాయి.

ఒకరకంగా చెప్పాలంటే లక్షాధికారినైన నాకు సమస్యలనేవే ఉండకూడదు. అందరినీ వేధించే మామూలు బాధలేవీ లేవు నాకు.

అయితే ముఖ్యమైంది, నిరంతరం నన్ను వేధించేది ఒకే సమస్య. అది డబ్బు. ఆ డబ్బు నాకు 'ల' కారాల్లో ఉంది. అయినా ఇంకా...ఇంకా... వేలకి వేలు, లక్షలకి లక్షలు సంపాదించి కోటీశ్వరుడినై పోవాలని ఆకాంక్ష. మునుపంతా రాజులు రాజులుగా ఉండిపోయారా తమ రాజ్యంతో సంతృప్తి పడి. చక్రవర్తులు కావాలనుకుని సమరాలు సాగించలేదూ...అలాగ.

నేనూ ... న్యాయాన్యాయాలతోనూ, నీతి అవినీతులతోనూ, లాభ నష్టాలతోనూ సమరం సాగిస్తూ లక్షాధికారి అయినవాడిని. కోటీశ్వరుడిని ఎందుకు కాకూడదూ?

పేరుమోసిన పెద్ద కంట్రాక్టరునయిన నాకు అదేమీ అసాధ్యం కాదు. వేలకు వేలు లాభాలు. వచ్చే కంట్రాక్టులు నాకే ఎలా రావాలో, అవి రావటానికి పెద్ద పెద్ద చేపలను ఎలా వలవేసి లాగాలో వలలోకి రావటానికి ఎలాంటి 'ఎర'లు వాడాలో బాగా అనుభవముయిన వాడిని.

ఊరికి దూరంగా అధునాతన సౌకర్యాలతో ఒక పెద్ద బంగళా, అదే రకమయిన మరో పెద్ద వేడ సొంతవూరయిన పల్లెటూల్లో కట్టించాను. ఆ బంగళాలోనే సామ, దాన, భేద, దండోపాయాలతో నా వ్యాపారం జరుగుతుంది. ఇచ్చి పుచ్చుకోడాలు అక్కడే సెటిలవుతాయి. మరీ రహస్యంగా జరగవలసిం దేదయినా ఉంటే, అది పల్లెటూళ్ళో ఉన్న

నా మేడలో జరుగుతుంది. ఎవరికీ తెలియకుండా, మరెవరికీ అనుమానం రాకుండా.

నాకు వేలకు వేలు కట్నం ఇచ్చి పిల్లనివ్వటానికి ఎందరో పెద్ద మనుషులు ప్రయత్నించారు. కాని, నేను వెతికి వెతికి పైసా కట్నంలేకుండా పెళ్ళి ఖర్చులు కూడా నేనే పెట్టుకుని పెళ్ళి చేసుకోవటం చూసి నలుగురూ ముక్కున వేలేసుకున్నారు.సుగుణను చేసుకోవటంలో నా అంతర్యం వాళ్ళ కెలా తెలుస్తుంది మరి ఇదీ ఒక వ్యాపార రహస్యమేనాయె.

సుగుణ కంట్రిబ్యూటీ. ఎలాంటి మగాడినయినా చిత్తుచేయగల పర్సనాలిటీ. చూసిన తొలిచూపులోనే ఎదుటపడ్డ మగాడు ఆవురావురనే లాంటి ఆడతనం. సిటీ నాగరికతలో నాజూకు పేరుతో ఎండిపోతున్న ఆడవాళ్ళ సాహచర్యంలో కక్కుర్తి బ్రతుకు గడుపు కునే పెద్ద మనుషులు సుగుణతో ఒక్క రాత్రి కోసం ఏమయినా చేయగలరు.

ఒక్క మాటలో చెప్పాలంటే నే వేసే గాలాలకు సుగుణ కూడా ఒక ఎర. భార్య, అర్ధాంగి అంటూ సెంటిమెంటు పట్టుకుని వేళ్ళాడే మూర్ఖుణ్ణి కాదు నేను. మా జీవితాల భోగభాగ్యాలలో తుల తూగటానికి ఇద్దరం శ్రమిస్తాం. అంతే.

సరిగ్గా ఇప్పుడు అలాంటి పనే తగిలింది.

రోడ్ కమ్ రైలు బ్రిడ్జికి టెండర్లు పిలిచారు. లక్షలతో పని జరిగినా, లక్షలలోనే లాభం ఉంటుంది.

దీనికి బలమయిన పోటీలు తగులు తున్నట్టు తెలిసింది. ఈ కంట్రాక్టు ఎలాగయినా నేనే కొట్టేయ్యాలి. ఉత్సవ విగ్రహాలతో లాభం లేదు. మూల విరాట్టునే పట్టాలి. ఎంత ఖర్చయినా సరే!

వివరాలు సేకరించాను. ఆ మూల విరాట్టు 'ఎస్' అంటే నా పంట పండినట్టే.

కాంతకు, కనకానికి దాసులు కానివారెవరో ...

కనకానికి లోటు లేదు. కాంతకూ లోటుండదు. అయినా ఈ సారి సుగుణనే భేటీ చేయాలనుకు న్నాను. కృత్రిమ వాతావరణంలో కాగితం పువ్వుల లాంటి ఆడవాళ్ళని ఎంజాయ్ చేసే ఆ పెద్దమనిషిని ముద్దబంతి పువ్వులాంటి సుగుణ కీలుబొమ్మని చేసేయదూ ...

ఈ దెబ్బతో నా స్టేటస్ ఎంతగానో పెరిగి పోతుంది. డబ్బుంటూ ఉంటే హోదా, పరువు, ప్రతిష్టలు పరుగెత్తుకుంటూ వస్తాయి.

ఆ మూల విరాట్టు పి. ఎ. ని కలుసుకుని, కావలసిన మూట అతని చేతుల్లో పెట్టాను పది రోజుల క్రితం. నా సమాచారం ఆ విరాట్టుకు చేర వేసి ఉంటాడు. ఇవాళ ఇక్కడ కలిసి ప్రోగ్రెస్, ప్రోగ్రాం చెబుతా నన్నాడు ఆ పి. ఎ.

ఇంకా రాలేదు మరి. లేక ఆత్రతలో మిస్ అవుతానేమో నన్న భయంతో ముందుగా వచ్చేసి ఉంటాను.

నాతో నేనే నవ్వుకోబోయి ఉలిక్కిపడ్డాను.

నా దృష్టి చప్పున అటుకేసి మళ్ళింది.

"ఇడియట్! కళ్ళు కనబడ్డంలా... తాగి ఉన్నా వురా స్కౌండ్రల్" అంటూ ఆ టేబులు దగ్గర కూర్చుని ఉన్న ఎలుగుబంటి ఒక్క ఉదుటున లేచి ఆ సర్వర్ షర్టు కాలరు పట్టుకుని ముందుకు గుంజి అతడి రెండు చెంపలనూ ఛళ్ ఛళ్ మని చరిచాడు.

రెప్పపాటులో జరిగిపోయిన ఈ హఠాత్సంఘ టనకు సర్వరు కుర్రాడు, ఇంకా నాలాంటి ఒక రిద్దరు విభ్రాంతులైనట్టు చూస్తూ కూర్చుండి పోయారు. కాఫీ కప్పులు టేబిలు మీద పెట్టబోయా డట సర్వరు కుర్రాడు. ఒక కప్పు కొద్దిగా స్లిప్ అయి కాఫీ తుళ్ళి ఆవిడ చీర మీద చిందింది. అదీ కథ! ఆ కుర్రాడు ఆవిడ వేపు చూశాడు. ఆవిడా చూసింది. ఆమె చూపుల్లో నిర్లక్ష్యం... గర్వం....

సర్వర్లందరూ అక్కడ గుమికూడిపోయారు. వాళ్ళ ముఖాల్లో తీవ్రతనుబట్టి తమందరికీ అవ మానం జరిగినట్టు భావిస్తున్నారు. బహుశా ఎలుగు బంటితో ఘర్షణ కు దిగవచ్చు.



పొరపాట్లు ఎవరికయినా జరుగుతాయి, సార్! అందుకు కొడతారా...''

''చెయ్యెత్తటానికి, కొట్టటానికి మీరెవరు, సార్! మీరేం మమ్మల్ని పెట్టి పోషిస్తున్నారా?'' ఒకరిని ఒకరు తోసుకుంటూ ముందుకు వచ్చి అతని మీది మీదికి రాసాగారు. తెబ్బతిన్న కుర్రాడు వాళ్ళను ఆపుతూ వెనక్కు నెట్టడమే ఆశ్చర్యంగా ఉంది. మేనేజరు పరుగున వచ్చాడు. వాళ్ళందరినీ గదమాయించి, ఆ పెద్దమనిషిని క్షమార్పణ కోరుకుని... వెర్రెక్కి ఆవేశంతో కుత కుత ఉడికే సర్వర్లందరినీ ప్రక్కకు తీసుకెళ్ళి సముదాయించి....

ఇంత జరుగుతున్నా, ఆవిడ తనకేం సంబంధం లేనట్లు... ఏదో సినిమా చూస్తున్నట్టు, అప్పుడప్పుడు కాఫీ ఒలకబోసిన కుర్రాడికేసి నిర్లక్ష్యంగా చూస్తూ... కుర్రాడు మళ్ళీ కాఫీలు తెచ్చాడు. మరో కప్పులో కాసిని పాలు తెచ్చాడు. కాస్త దూది తెచ్చాడు. పాలల్లో దూదిని ముంచి ఆవిడకిస్తూ—

''మేడమ్! దీన్ని ఆ మరకలమీద కాస్త అద్ది తుడవండి'' అంటూ ఇచ్చాడు. కోపంగా వాడికేసి చూస్తున్నాడు ఎలుగుబంటి.

మరకలు అద్దేసిన పాల కప్పును తీసుకుని వెనక్కి తిరిగి రెండడుగులు వేసిన వాడల్లా చప్పున వెనక్కు తిరిగి చూశాడు.

ఆవిడ కాఫీ అందుకోబోయి చేతికి నీళ్ళ గ్లాసు అడ్డు రావటంతో సరిగ్గా పట్టుకోలేనట్టు అయి... కాఫీ టేబిలుమీద ఒలికి... ఎలుగుబంటి వైపుగా జారి అతని పాంటు మీదకి కారింది. చప్పున లేచి నిలబడింది ఆవిడ.

''ఓహ్. ఐ యామ్ వెరీ సారీ'' ముందుకు వంగింది పశ్చాత్తాప పడుతున్నట్టు.

''డోంట్ బాదర్, డార్లింగ్! ఐ షల్ అడ్జస్ట్'' అంటూ జేబులోంచి కర్చీఫ్ తీసుకుని పాంటు మీద తుడవసాగాడు.

రెప్పపాటులో జరిగిపోయిన ఈ దృశ్యాన్ని చూస్తూ నిలబడి పోయిన సర్వరు కుర్రాడిని దగ్గరగా రమ్మని కళ్ళతో పిలిచింది ఆవిడ.

ఆ చూడటంలోనూ, ఆ పిలుపు లోనూ ఈ సారి అహంకారం, గర్వం కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. వాటి మాటున హేళనకూడా తొంగి తొంగి చూస్తూంది.

కుర్రాడు దగ్గరగా వచ్చి నిలబడి ఆమె సైగను అర్థం చేసుకుని పాలల్లో ముంచిన దూదిని అతని పాంటు మీద అద్దుతూ ఆవిడ కేసి చూశాడు.

ఆ కళ్ళలో కోపం లేదు. అవమానం లేదు. ఆ చూపుల్లో జాలి, సానుభూతి. చూపులు మరల్చుకుంటున్న క్షణాన కనబడిన ఒక విధమైన అసహ్యం.

ఇవేవీ నా దృష్టిని దాటిపోలేదు.

సర్వరు కుర్రాడికి పొరబాటున చేయి వణికి కాఫీ చుక్కలు పడేస్తే, కాలరు గుంజి చెంపలు వాయించిన మనిషి—కాఫీ కప్పు మొత్తం దొర్లించేసి పాంటు తడిపేసిన ఆ సుందరాంగిని ఏమనలేక పోయాడేం.

ఒకరి ఎడ నేరము మరొకరి పట్ల సవ్యము అవడానికి వారున్న స్థితి గతులే కారణమా! అందమైన, ఇష్టమైన ఆడది ఏం చేసినా ఫరవా లేదన్న మాట.

'నీకూ, నాకూ భేదం చూపిస్తాను చూడు' అన్నట్టుగా ఆవిడ కావాలని కప్పు తోసినట్టు నాకు కనిపించింది.


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్ ను వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ______
విలాసము: ______
______ PIN ______


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్



సాహితీ రంగంలో గత పదేళ్లుగా పాఠకులను తమ రచనలతో ఆనందపరవశుల్ని చేస్తున్న:
శ్రీమతి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచనలు

| | | | |
|---|---|---|---|
| చెట్టూ-ఛాయ .. 6.00 | బృందావనం ... 7.50 | ధర్మచక్రం .... 10.00 | జనరంజని .... 12.00 |
| విద్య ........ 6.00 | దివ్యదీపావళి ... 7.50 | చక్రవాకం .... 10.00 | తీయని శాపం .. 6.00 |
| సత్యం శివం సుందరం 10.00 | కల్పవృక్షం .... 6.00 | కళ్యాణమందిర్ .. 7.50 | అనిర్వచనీయం . 6.00 |
| శిలలు-శిల్పాలు ... 10.00 | దిక్చక్రం ..... 6.00 | ప్రేమనగర్ .... 7.50 | శోభకృతు .... 6.00 |
| పూజారిణి ..... 12.00 | చక్రనేమి .... 12.00 | చక్రభ్రమణం .. 7.50 | సుప్రభాతం .... 6.00 |
| సూర్యముఖి .... 10.00 | శంఖుతీర్థం ... 12.00 | యవనిక ...... 6.00 | హైందవి ..... త్వరలో |
| కల్పన ........ 6.00 | శాంతినికేతన్ ... 12.00 | సంసారచక్రం .. 7.50 | ఉషఃస్సు ..... త్వరలో |
| నందనవనం .... 12.00 | భాగ్యచక్రం ... 10.00 | పెళ్లి ఎవరికి! ... 6.00 | |

మీ దగ్గరి బుక్ షాపుల్లోనైనా కొనండి. లేదా పుస్తకాల ఖరీదులో 1 రూపాయి తగ్గించి M.O పంపితే ఆ రూపాయికి వి.పి పోస్టులో పంపగలము.
నవజ్యోతి పబ్లికేషన్స్ ఏలూరు రోడ్. విజయవాడ-2

పాలు అద్దుతూ పాంటు మరకలు తుడిచే ఆ కుర్రాడిని హేళన చేస్తున్నట్లు నిర్లక్ష్యంగా చూడటంలో ఆమె ఉద్దేశం!

టంగ్...టంగ్‌మని హోటల్లోని గడియారం గంటలు కొట్టటంతో ఉలిక్కి పడి వాచీ చూసుకున్నాను.

నేను వచ్చి గంట కావస్తోంది. నాకు కావలసిన మనిషి రాలేదు. వస్తానన్న టైం దాటిపోయింది. బహుశా రైలు తప్పి ఉంటుందా? నాలో చిరాకు. మళ్ళీ పది గంటలకు గానీ అటు వేపు నుంచి రావల్సిన బండి లేదు. ఆ ట్రైన్‌కు వస్తాడేమో చూడాలి. అప్పటిదాకా ఏం చేయటం. . .

సినిమా టైంకూడా దాటిపోయింది. అఁ. ఏం సినిమా లెద్దు. . . కాలక్షేపానికి ఏదో ఒకటి. పోయి హాల్లో కూర్చుంటే సరి. ఏదో ఒక బొమ్మలాట తెరమీద బొమ్మలు చూస్తూ ఈ టైం గడిపేయ వచ్చు.

బిల్లు ఇచ్చేసి రోడ్లోకి వచ్చాను. లాడ్జిలో రూం బుక్ చేశాను కానీ, ఇప్పుడప్పుడే వెళ్ళాలని లేదు.కాలక్షేపం కావాలంటే బోలెడు క్లబ్బు లున్నాయి, నా లాంటి వాళ్ళ కోసం ఎదురు చూస్తూ. అయినా, వెళ్ళాలని లేదు.

ఇందాక హోటల్లో ఆ జంట, జరిగిన ఆ సంఘటన, ఆ సర్వరు కుర్రాడు కళ్ళ ముందు మెదులుతున్నారు. ఆ ఆలోచనలని తుడిచి పెట్టాలని లేదు. చటుక్కున ఆగాను. నన్నేనా...

వెనక్కి తిరిగి చూశాను. హోటల్‌లోని ఆ కుర్రాడే—'సార్!' నన్నే పిలుస్తున్నాడు వెనక నుంచి. పగరుస్తూ వచ్చాడు. అతడి చేతిలో నా లెదర్ బాగ్. అప్పుడు గుర్తొచ్చింది—నా చేతుల్లో ఉండాల్సిన బాగ్ గురించి.

"మీరు...హోటల్‌లో మరిచి పోయారు, సార్!" అందిస్తూ అన్నాడు.

"అవునవును. మరిచిపోయాను థాంక్ యు." బాగ్ అందుకని జేబులోంచి పది నోటు తీశాను. తన ముందుకు జాచిన చేతిలో నోటు చూచి ఒక్క అడుగు వెనక్కు వేశాడు ఆ కుర్రాడు.

"తీసుకో. సంతోషంగా ఇస్తున్నాను."

"థాంక్స్ సార్! వద్దు." వినయంగా అన్నాడు.

"బాగ్ తెరిచి చూశావా?"

"నాకేం అవసరం ఉంది, సార్ ఓపెన్ చెయ్యటానికి. మీరు హోటల్లోకి వచ్చినప్పుడు మీ పక్క కుర్చీలోనూ అది ఉండటం చూశాను. మీదని బాగా తెలిసింది గనుక వెంటనే మీకోసం బయలుదేరి వచ్చాను."

"అందులో పది వేలు కాష్ ఉంది."

"పది లక్షలున్నా నాకు అవసరం లేదు, సార్!"

ఆ మాట నన్నెక్కడో దెబ్బ కొట్టింది.

"బహుశా బాగు తీసి చూసి ఉంటే నా కోసం వెతికే వాడివి కావేమో..." అనుమానం స్ఫురిస్తున్నట్టుగా అడిగాను.

చురుగ్గా నా కళ్ళలోకి చూశా డతను.

"సార్! క్షమించండి. మీరు గొప్పవాళ్ళే కావచ్చు. అయినంతమాత్రాన పేదవాళ్ళు-నాలాంటి పనివాళ్ళు దొంగలయి ఉంటారని అనుకోకండి. డబ్బు కోసం గడ్డి తినేవాడిని కాను. అలా అయి ఉంటే ఈనాడు ఇలా సర్వరు ఉద్యోగం చేసుకుంటూ నలుగురికీ వూడిగం చేసే అవసరమే ఉండేది కాదు. నీతిని వదులుకుని దొంగను కావాలని లేదు నాకు."

ఒక్కక్షణం విభ్రాంతుడ నయినట్టు అలా నిలబడి పోయాను. ఆ కుర్రాడి మాటలు నా గుండె లోతుల్ని స్పృశిస్తున్నాయా...

"నీ పేరు?"

"ప్రసాద్, సార్!"

"నీ విప్పుడు తిరిగి హోటల్‌కు వెళ్ళాలా?"

"లేదు, సార్! నా డ్యూటీ అయిపోయింది. ఇంటికి వెడుతున్నాను."

"అయితే అలా వెళ్ళి ఆ హోటల్లో కాఫీ తీసుకుందాం రా. దీనికి కూడా అభ్యంతరం చెప్పకు."

ఆ మాటతో తోసేయలేనట్టుగా, మొహమాటంగా నా వెంట బయలుదేరాడు ప్రసాద్. చిప్స్ తెప్పించాను. హోటల్ గార్డెన్‌లో కూర్చుని ఉన్నాము. మరేం మాటాడలేనట్టుగా ఒక్కొటే నోట్లో పెట్టుకుంటున్నాడు నిదానంగా.

'ఎంతవరకు చదువుకొన్నావ్?' యాధాలాపంగా


# రోజుకు 24 గంటలూ పేదతీర్చే నీరు...

## వాస్ప్ పంపింగ్ పద్ధతులతో

మీరెక్కడైనా నివసించండి. ఏ విధంగానైనా మీరు పూర్తి వేగంలో నీటిని పొందవచ్చు. భూగర్భ ప్రవాహము లోతైన బోర్‌వెల్ లేక బాహ్య నూతులు (85 మీటర్ల లోతులో కూడా) సరస్సు, నది మొదలగునవి.

వాస్ప్‌లో వివిధ శ్రేణిగల పంపులు గలవు. సెంట్రీఫ్యూగల్, సెల్ఫ్-ప్రైమింగ్, ఎజెక్టోజెట్ పంపులు సబ్‌మెర్సిబుల్ పంపులు....ఇవన్నీ మీ అవసరాల కనుగుణ్యమైనవి. మీకు అవసరమయ్యే పంపునే పొందుటకైన అనువైన సాంకేతిక సలహా కూడా ఇవ్వబడును. మీకు త్వరగా మరియు విశిష్టమైన సేవ చేయటానికై దేశవ్యాప్తంగా మా శాఖలు వున్నాయి మరియు డీలర్లు కూడా గలరు



నేడే కూపన్ పోస్ట్ చేయండి

**వాటర్ సప్లయ్ స్పెషలిస్ట్స్ ప్రై. లి.**
8, అంబాలాల్ దోషి మార్గ్,
ఫోర్ట్, బొంబాయి 400 023.

నాకున్న ఈ ప్రత్యేకమైన నీటి సమస్యను గురించి ఈ నా పుత్తరములో వివరించి యున్నాను. దయచేసి సరైన పంపును సూచించండి. దయచేసి మీ రిప్రజెంటేటివ్‌ను పంపించండి.

పేరు ______________________
______________________
చిరునామా ______________________
______________________

శాఖలు : కలకత్తా • మద్రాసు • న్యూఢిల్లీ
సికిందరాబాద్



Wasp®
Ejecto జెట్ పంప్

Dattaram-WS/229 B/Tel.

అడిగాను. తలెత్తి నా కళ్ళలోకి సూటిగా చూసి చిన్నని తల వంచుకున్నాడు.


"ఏం ?"

అతనితో పాటి పక్కకి తిరిగి చూశాను.

ఆవిడే... మా పక్కనే నిలబడి ... అంటోంది, వ్యంగ్యంగా నవ్వుతూ. ఆవిడతో వచ్చిన ఇంకా నాలు గుగులు ముందుకు నడిచి వెళ్ళి ఎవరితోటో మాటాడు తున్నారు. తను నిలబడి మా మాటలు విన్నట్టుంది. కోపంగా, రోషంగా చూస్తున్నాడు ప్రసాద్ ఆవిడకేసి. ఆవిడలా వ్యంగ్యంగా నవ్వుతోనట్టే సహజ్యంగా నిలుచుని ఉంది.

"నా జోలికి రావద్దని చెప్పాను నీకు."

ప్రసాదు కోపంతో ముక్కుపుటాలు అదిరి పోతుం డగా అన్నాడు. అతని మాటలు గానీ, చూపులు గానీ ఇందాక హోటల్లో అతని ఎడల కని పించిన మర్యాద, వినయం, విధేయత అనిగించంతి కూడా లేవు. పైగా కళ్ళనిండా హేళన. ఆశ్చర్య




పోయాను నేను ఇద్దరినీ చూసి.

ఆవిడే అంది నవ్వుతూ—"నేను మాటాడింది. ఆ పెద్ద మనిషితో. నా జవాబు ఆయన ప్రశ్నకి."

"ప్రశ్న నాకు సంబంధించింది. అడుగుతున్నది నన్ను. నీతో మాట్లాడాలంటే కంపరం నాకు. ఇంకో క్షణంలో నీవు ఇక్కడి నుండి కదిలి వెళ్ళక పోతే నేనే..." లేచి నిలబడ్డాడు వెళ్ళిపోతున్నట్టు.

హు అని ఈసడింపుగా అని ముఖం పక్కకు తిప్పుకుని చరచరా వెళ్ళిపోయి తన బంధువు కలుసు కుంది.

ఆ ముఖం తిప్పుకుంటున్న క్షణాన సమ యంలో ఆ కళ్ళలో మెరిసిన తడి నా దృష్టిలో పడింది.

ప్రసాదు సర్దుకుని కూర్చున్నాడు. అప్పటి దాకా గుడ్లప్పగించి చూస్తున్న నేను వాస్తవంలోకి వచ్చాను.

"ఆవిడ నీకు తెలుసా?" కుతూహలంగా అడిగాను.

క్షణంసేపు ఏం మాట్లాడలేదు ప్రసాద్. నేను ఎదురుచూస్తున్నాను.

"మా అక్కయ్య!"

ఉలిక్కిపడ్డాను. నమ్మ బుద్ధి కాలేదు. 'అంటే?'

"రక్తం పంచుకుని పుట్టిన తోబుట్టువే!" నా సందేహాన్ని గమనించినట్టుగా అన్నాడు.

"ప్రసాద్! నా కాష్ బాగ్ నీవు నాకు తెచ్చి ఇవ్వటంతోనూ, బహుమతిగా నే నిచ్చిన సొమ్ముకు ఆశపడకపోవడంతోనూ నీ మీద, నీ నిజాయితీ మీద, నీ మంచితనం మీద నాకు అపేక్ష కలుగు తోంది. నీ కేమనుకోకపోతే ...

"నా గురించి చెప్పమంటారు. అంతేనా, సార్!" దాని నవ్వు నవ్వుతూ అన్నాడు.

అవునన్నట్టుగా తలాడించాను.

మరో రెండు ప్లేట్లు టిఫిన్ తెప్పించాను. ప్రసాదు కాసేపు ఏదో ఆలోచనలో మునిగినట్టు కనబడ్డాడు. బహుశా కథ ఎలా మొదలుపెట్టాలా అని అయి

ఉండొచ్చు. నేను డిస్టర్బ్ చేయలేదు.

"మాది చింతలు కలిగిన పెద్ద కుటుంబం. మా నాన్న ఆఫీస్ ప్యూన్‌గా పనిచేసేవాడు. అమ్మ తన శక్తంతా ఆరుగురు పిల్లల్ని కనడానికి, సాకడానికి ధారపోసి ఆరోగ్యం కోల్పోయింది. అక్క, నేను, చెల్లి, ముగ్గురు తమ్ముళ్ళు—ఇదీ మా కుటుంబం."

క్షణం ఆగాడు, ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్టు.

బాప్‌రే. ప్యూను జీతం నా ఒక్క రోజు ఖర్చంత కూడా ఉండదు. ఆ జీతంలో ఇంతమంది... తిని, తాగి ... బట్టగట్టి ... ఎలా బతికారో వూహించటానికి కూడా నేను అసమర్థుడినయ్యాను.

"మా నాన్న నన్ను తన పెద్దకొడుకుగా, తన తర్వాత మా కుటుంబం ఆదుకోవలసిన ఆర్త రక్షకునిలా నన్ను గురించి శ్రద్ధ తీసుకున్నాడు. తన శక్తిని మించి చదివించటానికి, ఆ ప్యూన్ ఉద్యోగమే వారసత్వంగా రాకుండా ఉండటానికి ఎంతగా శ్రమించాడో, నా మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో నాకు, ఆయనకి మాత్రమే బాగా తెలుసు. రాత్రిళ్ళు

తను తినకుండా మిగిల్చిన అన్నం పొద్దున్నే స్కూలుకు వెళ్ళే నాకు పెట్టేది అమ్మ. ఆమె భయానికి అటు పక్క రాకపోయినా—నా చెల్లెలు, చిన్న తమ్ముళ్ళు తలుపు సందులోంచి, కిటికీల్లోంచి ఆబగా, ఆశగా, దీనంగా నా పళ్ళెం కేసి చూసేవాళ్ళు. నా కడుపులో దేవినట్టు అయి కంచంలో సగానికి పైగా మిగిలిం చేసే వాడిని. నేను ఇవతలికి వచ్చాక కాకుల్లా, కుక్కల్లా ఆ ఎంగిలి పళ్ళెం మీదకు కలబడేవాళ్ళు పిల్లలు.

ఈ దీనావస్థ చూడలేక ఎక్కడైనా నేనూ కూలి పనిచేసి డబ్బులు సంపాదిస్తానంటే నేవాణ్ణి. అమ్మ, నాన్న కళ్ళ నీళ్ళు పెట్టుకునే వాళ్ళు. ఆ కూలి పనులతో ఈ పొట్టలు ఎలాగూ నిండవని, కొన్నాళ్ళు ఇలా కష్టపడితే ఆ తరవాత నయినా హాయిగా బ్రతకొచ్చని నాకు బోధించే వాళ్ళు.

వాళ్ళ కలలు నిజం చేయాలన్న పట్టుదలలో, నా తోబుట్టువుల ఆకళ్ళు తీర్చాలన్న తపనతో మరి చదువులో బాగా కృషి సలిపి స్కాలర్‌షిప్‌లు సంపా దించుకునేలా చేశాయి. దాంతో ఫీజులు బాధ తప్పింది. స్నేహితుల నడిగో, లైబ్రరీలోనో పుస్తకాలు తెచ్చుకుని చదువుకొనే వాడిని.

మా అక్కయ్య మా వీధిలోనే ఉన్న కుట్టు సెంటరుకు వెళ్ళి ఏదో కుట్లు, అల్లికలు నేర్చుకుని రే వాళ్ళకు కూడా కుట్టి ఇవ్వసాగింది. దాని బట్టలు, గాజులు, రిబ్బన్లు-ఇలాంటి ఆడపిల్ల అవసరాలు గడిచి పోయేవి. అయితే ఆ సెంటరుకు వెళ్ళటం మొదలు పెట్టాకనే దానికి ప్రపంచమంటే ఏమిటో తెలిసింది. ఏదో తినటం, పడి నిద్రపోవటమే కాదని, బయట చూడవలసిన రంగుల ప్రపంచం ఎంతో ఉందని, అనుభవించవలసిన ఆనందాలు కొల్లలని గ్రహించింది. పేడపురుగు లాంటి తన బ్రతుకుని ప్రతిక్షణం తలుచుకుని అసహ్యించుకోవటం మొదలుపెట్టింది. దాంతో నిర్జీవంగా, నిర్లిప్తంగా సాగిపోయే తన బ్రతుక్కి, తన జన్మకు ఈ పేద తల్లిదండ్రులే కారణమని, తన క్షేమాత్రం సుఖం దక్కనివ్వకుండా ప్రతి చిన్నదానికోసం భాగస్థులుగా వచ్చే తోబుట్టు వులు తన పాలిటి శని దేవతలని భావించి ఈసడించు కోటం ఎక్కువయింది.

మొదట్లో దాని ప్రవర్తనకు అమ్మా, నాన్నా తిట్టినా రాను రాను దాని ఖర్మానికి వదిలేసినట్టు, ఆ మాటలు దాని చర్య మామూలేనని అలవాటుగా సరిపెట్టుకున్నట్టు తేలిపోవటంతో అక్కయ్యలో ఏదో కసి బయలుదేరింది. అప్పుడప్పుడు దది నా మీదకు తిరిగేది. నన్నేదో సింహాసనంలో కూర్చో బెట్టినట్టు, ఇంట్లో వాళ్ళంతా నా సుఖంకోసం తాపత్రయ పడిపోతున్నట్టు భావించి నన్ను ద్వేషిం చటం మొదలుపెట్టింది.

వయసుకు, యౌవనానికి, అందాలకు గొప్ప, బీద తారతమ్యం లేదు. అక్కయ్య ఎదిగేకొద్దీ పేద పిల్లన్న భేద భావం ఏమాత్రం చూడకుండా ఇవన్నీ తనలో చోటు చేసుకున్నాయి. సహజంగానే అలంకరణపట్ల శ్రద్ధ పెరిగింది దానికి. అంతే కాదు; తనింకా చాలా ఎదిగిందని నేను ఇంటరు పరీక్షలు రాస్తున్నపుడు తెలిసింది.

ఆ రోజు నేను ఫ్రెండ్స్‌తో కలిసి చదువుకోవాలను

కుని అందరితో కలిసి సాయంత్రంగా కెనాల్ వద్దకు వెళ్ళావు. తలోక పుస్తకం తీసుకుని అక్కడక్కడా కూర్చున్నారు. నేను మాత్రం పుస్తకం చదువుతూ, తిరుగుతూ ఒడ్డునే అలా నాకు తెలియకుండానే కొంచెం దూరం నడిచాను. చాల దూరం వచ్చేశానే అనుకుంటూ తిరుగుముఖం పట్టిన నాకు కెనాల్ అవతలి గట్టున ఒళ్ళు మరిచి ఉన్న జంటలోని స్త్రీ మా అక్కయ్యలా కనిపించటంతో నిశ్చేష్టుడనయి పోయాను. రూఢి చేసుకోవాలనిపించి నా స్నేహితులు వెడదాంరమ్మంటే కాసేపుండి వస్తానని ఆగిపోయాను. వాళ్ళు వచ్చేస్తున్నపుడు తెలిసిపోయింది అక్కయ్యేనని.

ఏదో ఆవేదనతో ఇంటికి తిరిగి వచ్చాను. అమ్మా, నాన్నకు చెబితే... వాళ్ళ గుండెలో ఇది మరింత చిచ్చు పెట్టడమే అవుతుంది. చెప్పకపోతే అక్కయ్య మరింత బరితెగించి... ఏదయినా జరిగితే అవమానం భరించ గలరా తాము.

ఆ రాత్రి అందరూ పడుకున్నాక అక్కయ్య దగ్గరకు వెళ్ళాను. నలుగురి పిల్లల మధ్య వెల్లకిలా డుకుని ఆకాశంలోని చంద్రుడికేసి చూస్తూ ఉంది.

''ఏరా''... అంది నన్ను చూసి.

''లేచి ఇలా పెరట్లోకి వస్తావా?'' అన్నాను.

''ఎందుకు?'' నిర్లక్ష్యంగా అంది.

''పనుంది.''

ఏమనుకుంద్ లేచి బట్టలు సర్దుకుని జడను ముడి చుట్టుకుంటూ 'పద' అన్నట్టు చూసింది.

వీధి వసారాలో బండలమీద బొంతలు పరుచుకుని పడుకుని అలిసి నిద్రపోతున్న అమ్మా, నాన్నని, పిల్లల్ని దాటుకుని ఇంటి చుట్టు సందు తిరుక్కుని పెరట్లో నుయ్యి దగ్గరికి వచ్చాము.

ఏం మాట్లాడాలో, ఎలా మొదలు పెట్టాలో తోచలేదు.

''ఏమిట్రా మంచి నిద్ర పాడుచేసి లేపి మూగి ఎద్దులా నుంచున్నావ్?''నాకు కోపం వచ్చింది. కాలేజి చదువుతున్నవాడిని. తన కంటే చిన్నవాడినయితే మాత్రం ఎద్దు, మొద్దు అంటే... నన్ను నేను సంబా ళించుకున్నాను. నా మీద దానికున్న కసి అలా వెళ్ళ గక్కుతూంటుంది. అలా సమాధాన పడినా, కోపం కమ్మిన ఛాయలు పూర్తిగా తొలగనందున నాలో కాస్త ఆవేశం పొంగింది.

''సాయంత్రం ఎవడితోటే కాలువ ఒడ్డున షికార్లు కొడుతున్నావు?'' నా కంఠం నాకే కటుగ్గా, అసహ్యంగా వినిపించింది. నిజానికి నేను అలా అడగా లనుకోలేదు. ఎంతో సౌమ్యంగా, స్నేహభావంతో అడిగి తెలుసుకొని, అమ్మా, నాన్నల కష్ట సుఖాలు చెప్పి, వాళ్ళ బాధలు వివరించి మంచిగా ఎంతో నచ్చ చెబుతున్నట్టుగా మాట్లాడాలనుకున్నాను. కాని దాని ఈసడింపు మాటలతో తిక్కరేగినట్టయింది.

''నీవు చూశావా!'' సాధారణంగా అడిగినట్టుంది. ఆ అడగటంలో భయం లేదు.

''అవును. చూశాను గనుకే అడగటం.''

ఖచ్చితంగా అన్నాను. ఈ మాటతో భయపడు తుందని, జాగ్రత్తలు చెప్పి హెచ్చరించి పెడదామని అనుకున్నాను. నా అంచనా తారుమారు అయింది.

''ఓహో...'' అనేసి ఏదో ఆలోచిస్తున్నట్టుగా నిలబడింది.

''ఎవరే వాడు?'' నా కంఠంలో ఎంత తెచ్చు కుందామనుకున్నా మార్దవం పలకటం లేదు.

''ఎవరయితే నీ కెందుకు?'' నిర్లక్ష్యంగా అంది.

''నా అక్కయ్యవు గనుక. నీ మంచి చెడ్డల ప్రభావం మా అందరి మీదా ఉంటుంది గనుక.'' కోపంతో దవడలు బిగుసుకుంటున్నాయి నాకు.

''నీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు.'' చివ్వున వెనక్కి తిరిగి పోబోయింది. చప్పున దాని చేయి అందుకుని బిగించి పట్టుకున్నాను.

''అయితే నీ తిరుగుడు సంగతి అమ్మ, నాన్నలతో చెప్పాల్సి ఉంటుంది'' అంటూ బెదిరిస్తున్నట్టుగా ఉరిమి చూశాను.

''ఒరే పిచ్చి మొద్దూ! అమ్మా నాన్నలకు చెప్పాలి సింది ఈ విషయం కాదురా. తీర్చుకోను తాహతు లేక, కోరడానికికూడా అర్హత లేక గుండెలోనే సమాధి చేసేసే ఎన్నో కోరికలతో పాటు, అణగదొక్కే కొద్దీ విజృంభించే కోరికలు కొన్ని ఉంటాయి. వాటిని చంపటం కష్టం. అవే మనల్ని చంపుకు తింటాయి. ఈ విషయం ఇంకో రెండు మూడు ఏళ్ళు గడిచాక నీకూ తెలుస్తుంది. అయినా నీతో నా కేమిటి? నీకు దమ్ముంటే అమ్మా, నాన్న దగ్గిరికి వెళ్ళి, వాళ్ళకు తాహతుంటే నాకు పెళ్ళి చేయుమని చెప్పు.''

అనేసి రివ్వున తన చేయి లాక్కుని చరచరా అక్కడి నుంచి వెళ్ళి పోయింది అక్కయ్య. దాని తెగింపుకు ఉ(ప్రతిభు డయినట్టు అలాగే నుంచుండి పోయాను. ఇన్ని మాటలు, ఇంత భారం, ఈ భాష ఎప్పుడు, ఎక్కడ, ఎలా నేర్చింది? మాటలు పలక డానికి, భావాలు వెలరేగటానికి, చదువులే అక్కర లేదు. నలుగురితో కలిసి తిరుగుతూంటే చాలు నేమో. . .

మరేం చేయలేనట్టు తిరిగి వచ్చేసి పడుకున్నాను. ముఖంకూడా కనపడకుండా దుప్పటి ముసుగేసుకుని పడుకునుంది. ముగ్గురికి కప్పిన ఆ దుప్పటే చాల నందువల్ల కాబోలు ఆమె గుండె ఎగిసి పడటం చూశాను. ఆ ముసుగు లోపల అక్కయ్య ఏడు స్తోందా. . .

నా కడుపులో అవ్యక్తమయిన వేదన.

బయటికి వెళ్ళడి చేయకపోయినా, నేను ఇంట్లో చెబుతానని కాబోలు గొడవ జరగటం ఇష్టం లేకనో, భయం చేతో నాలుగయిదు రోజులు ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే ఉండిపోయింది. నేనా విషయం నా గుండెలోనే దాచుకున్నాను.

సెంటరునుంచి ఏవేవో పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ ఉండేది. సాయంత్రాలు ఒక గంటసేపు చదువు చెబుతున్నారని, తనూ ఇంగ్లీషు నేర్చుకుంటా నని అడిగింది. జీతమంటూ లేదు గనుక ఒప్పు కున్నారు నాన్న.

నా ఇంటరు ముగిసింది. స్కాలర్‌షిప్ వచ్చింది. అయినా, ఇక చదవాలని లేదు.

''నాన్నా! నేనూ ఏదయినా పని చూసుకుంటాను'' అన్నాను.


''ఇంటరు చదువుకు ఏం పని వస్తుందిరా. కూలిపని కూడా ఇవ్వరు. చదువుకున్న కుర్రాడివని. మా అగ చాట్లు మేం పడతాం ఏదో ఒక డిగ్రీ పూర్తి చెయ్యి, నాయనా'' అన్నాడు నాన్న.

నాన్న మాటలు నిజమే ననిపించాయి. పొరుగూరు వెళ్ళాలి.

ఆ ఊర్లో కాలేజీలో బి. ఎ. లో చేరాను. ఆ ఊర్లోనే ఉంటున్న మా మేనమామ ఇంట్లో మకాం.

ఒక రోజు, రెండు రోజులా ... మూడేళ్ళు. వాళ్ళింట్లో ఉండాలంటే నేను ఇష్టపడలేదు. అయినా బయటెక్కడయినా ఉండి హోటల్లో తిని చదువు కొనే స్తోమతు లేదు. నాన్నను ఇబ్బంది పెట్టలేక మేనమామ ఇంట్లోనే ఉండిపోయాను. గతిలేకపోతే బంధువుల ఇంట్లో ఉండటం ఎంతకష్టమో అప్పుడు బాగా తెలిసి వచ్చింది.

ఒక నెలపాటు బాగానే జరిగిపోయింది. ఆ తరవాతే మొదలయింది నిరాదరణ.



మిగిలిపోయిన చద్దన్నాలు తినటానికి, జీతంలేని నౌకరుగా పనిచేయటానికి బాగా ఉపయోగపడ్డాను.

చద్దన్నం తినటం, ఇంటి పనులు చేయటం నాకు కొత్తకాదు. అలవాటులేకపో లేదు. అయినా, మరీ నీళ్ళు కారుతూ పాచిపోయిన అన్నం, కూరలు తినలేక అర్ధాకలితో వెళ్ళిపోయే వాడిని.

కష్టపడి పనిచేయటం, కడుపు నిండకపోయినా, ఆకలేస్తున్నా నన్ను నేను కంట్రోల్ చేసుకోవటం అలవాటయిపోయింది.

'అనువుగానిచోట అధికుల మనరాదు', అని తెలుసు. అయినా, నా ఆధిక్యత ఏముం దసలు. ఎలాగో ఒకలా ఈ చదువు ముగించాలి. ఇబ్బందులను సమస్యలుగా మార్చుకుని బుర్ర పాడుచేసుకోవటం నాకు ఇష్టం లేదు. చదువే నా ధ్యేయం అనుకుని ఆ పనులకు, ఆ మాటలకు, ఆ తిండికి అనుగుణంగా మారిపోయాను. సెలవుల్లో ఇంటికి వచ్చేవాడిని. అక్కయ్యలో మార్పు బాగా కనబడుతోంది. ఇంగ్లీషు చదవటం, కొద్ది కొద్దిగా వ్రాయటం కూడా నేర్చుకుంది. తనూ కుట్లు నేర్చుకుందట. నెలకు అరవై ఇస్తారుట.

అయితే దాన్ని చూస్తుంటే ఆ అరవైలో ఇంట్లో ఒక్క రూపాయన్నా ఇస్తుందా అని అనుమానం వచ్చింది. ఆ మాటే అడిగాను.

కస్సుమని లేచింది నా పైకి.

''నే నివ్వటం ఏమిటి? కష్టపడుతున్నాను. తెచ్చుకుంటున్నాను. నా అవసరాలకు నాన్నను అడక్కుండా గడుపుకొంటున్నందుకు సంతోషించు. తిండిమాత్రమే వాళ్ళది తింటున్నాను తెలుసా?'' అంది.

'నీ కయితే ఎన్నింటికో ఖర్చుపెడుతున్నారనే' విద్వారం ధ్వనించింది.

మొదటి సంవత్సరం బి. ఎ. ఎలాగో గడిచి పోయింది.

రెండో ఏడు ఇంట్లో అత్త రుసరుసలు ఎక్కువయ్యాయి.

''ఏండ్ల పర్యంతం ఒక మనిషిని పోషించాలంటే మాటలా?'' అనేది నేను వినేట్టు. మామ మంచివాడనే చెప్పాలి. తను చేయగలిగిన సాయం నన్ను ఇంట్లో పెట్టుకుని భోజనం పెట్టడం వరకే నని, ఇంకేం చేయడానికి శక్తి లేదని చెప్పాడు. అదే పదివే లనిపించింది.

హైస్కూలు పిల్లలకు ఐదారుగురికి ట్యూషన్లు చెప్పటం మొదలెట్టాను. వాళ్ళిచ్చే డబ్బుతో పదో, పదిహేనో నా కుంచుకుని మిగతది 'నీవు వాడుకో అత్తా' అని ఇచ్చాను. అది ఆవిడ స్వంత డబ్బుగా ఖర్చు చేసుకో వచ్చు ననిపించటంతో నన్ను బాగానే చూడటం మొదలు పెట్టింది.

రెండో ఏడు సెలవుల్లో ఇంటికి వెళ్ళలేదు నేను. నాన్నే వచ్చి చూసి కొద్దిగా డబ్బు ఇచ్చి వెళ్ళాడు.

'దరిద్రుడు తల కడగబోతే రాళ్ళవాన కురిసిం' దన్న సామెత ఒక్కొక్కప్పుడు నిజమవుతుందేమో.

బి. ఎ. ఫైనలియర్ పరీక్షప్పుడు 'ఫ్లూ' జ్వరం వచ్చేసింది బాగా. ఇంజక్షన్లు చేసుకుని, మాత్రలు మింగి నూటరెండు, నూట మూడు డిగ్రీల జ్వరంతోనే వెళ్ళి పరీక్షలు వ్రాశాను. ఆఖరు పరీక్ష వ్రాసి బయటికి వచ్చేశాక కాలేజి ఆవరణలోనే ఒక చెట్టు కింద కూచుని భోరుమని ఏడ్చాను.

ఈ మూడేళ్ళు ఎంత కష్టపడి చదివాను. మెరిట్‌లో పాస్ కావాలని, అయితీరాలని శ్రమ, ఆకలి, నిద్ర అనుకోకుండా ఎంత పాటుపడ్డాను. కాని, నేను చదివిందంతా, నా బుర్రలో మెదులుతున్న దంతా పేపరు మీద పెట్టలేని నా ఆసక్తతకు, పిశాచిలా పట్టుకున్న జ్వరానికి... నా మీద నాకే కోపం వచ్చింది. కానీ ఏం చేయను? నా శ్రమంతా బూడిదలో పోసినట్టయింది.

''పాసవుతావుకదా'' అన్నాడు నాన్న నీరసంగా.

'ఏమో' అన్నాను. నాన్న ముఖంలోకి చూడలేక పోయాను. ఆ కళ్ళలో కనబడే బాధను భరించేశక్తి లేదు నాకు.

ఇంటికొచ్చేశాక కూడా పది, పదిహేను రోజుల దాకా మామూలు మనిషిని కాలేకపోయాను. కొన్నాళ్ళు పిచ్చిగా బయట తిరిగాను.

ఎంతో కష్టపడి చదివి కూడా జ్వరం మూలంగ సరిగ్గా వ్రాయలేక పోయానే అని ప్రతిక్షణం బాధపడేవాణ్ణి. పేపరు మీద వ్రాసిందానికే తప్ప నా బుర్రలో నిండిపోయిన విజ్ఞానానికి విలువెక్కడుంది?



త్రిముఖి —ఎస్. పి. కుమార్

రిజల్టు చూసి నాకే ఆశ్చర్యమయింది. ఫస్ట్ క్లాస్ వచ్చింది. ఎగిరి గంతేశాను. నా గుండెలో భారము, బాధ చేయిపెట్టి తీసేసినట్టయిపోయింది.

'అయ్యో, ఈ జ్వర పిశాచి పట్టుకోకుండా ఉంటే బి. ఎ. లో కూడా మెరిట్ స్కాలర్‌షిప్ సంపాదించి ఉండేవాడిని కదా' అంటూ మనసు మారుమూలల్లో పిసరంత బాధ తొలచకపోలేదు.

ఆ జ్వర తీవ్రతలో ఏం వ్రాశానో కూడా తెలీక తప్పుతాననే అనుకున్నాను. అలాంటప్పుడు ఫస్ట్ క్లాసులో పాసవటం నాకు వరమే అనిపించింది.

అమ్మా, నాన్నల ఆనందానికి అంతేలేదు. ఇక పిల్లలయితే వాళ్ళన్నయ్య అప్పుడే గొప్ప ఆఫీసరయినట్టుగా, దోసిళ్ళనిండా డబ్బు తెచ్చి పోసేస్తున్నట్టుగా సంబర పడిపోయారు. ఏ భావమూ వ్యక్తం చేయనిది అక్కయ్య ఒక్కతే.

ఉద్యోగాలు రావటానికి డిగ్రీలు కొలమానం కావని, చాలా కొద్ది రోజుల్లోనే తెలిసొచ్చింది నాకూ, నాన్నకూ కూడా.

బి. ఎ. ఎందుకూ పనికిరాదని తేలిపోయింది.

వేకెన్సీ ఉన్నచోటికంతా అప్లయ్ చేయటం, ఇంటర్వ్యూ కార్డు రాగానే ఉద్యోగం వచ్చేసినట్టు సంబరపడిపోటం, ఆ కాస్త ముచ్చట తీరగానే ముఖం వేళ్ళాడేసుకుని రావటం మొదట్లో అవమానంగా అనిపించినా, ఆ తరవాత అలవాటయిపోయింది. నాలో నిరుత్సాహం మొదలయ్యింది. నాన్న ముఖం చూడలేక పోయేవాడిని. అయినా తను పనిచేస్తున్న ఆఫీసులోనూ, ఇతర చోట్ల ఆఫీసర్లను అడిగి చూశాడు. ఈ అనుభవాల వల్ల చివరకు నేను తెలుసుకుంది ఉద్యోగాలకు తెలివితేటలే అక్కరలేదని.

ఊరికే ఉండేబదులు ప్యూనుగా నయినా ఏదయినా ఆఫీసులో చేస్తానన్నాను. నా మాట విని నాన్న ముఖంలో కనబడిన వేదన ఇలాంటిదని వర్ణించలేను. తన కొడుకు తనలాగ ప్యూను కాకుండ ఆఫీసరు కాకపోయినా ఒక మోస్తరు ఉద్యోగం చేయాలని, వాడి ఆధారంగా కుటుంబం కళకళ్ళాడాలని తను కడుపులు కట్టుకుని, గొడ్డు చాకిరీలు చేసింది ఇందుకేనా? అని కాబోలు.

గుండె మీద కుంపటిలా ఉన్న కూతురితోపాటు నేనూ ఒక కుంపటిగా తయారయ్యాను. పెళ్ళి కెదిగిన ఆడపిల్ల, ఉద్యోగం రాని కొడుకు ఒకే కోవకు చెందిన వారేమో. ఇంటర్వ్యూలు అభ్యర్థుల కళ్ళు తుడుపుల కేనని తెలిసిపోయింది.

దక్షిణలు ఇవ్వాలట? ఎంత? పదులు, వందలు కాదు. వేలు. వేల డబ్బు ఎక్కడ్నుంచి తేవటం? పెరట్లో కాసే చెట్టా?

ఆ వేల డబ్బే ఉంటే ఇలా కాళ్ళరిగేలా, ఎండలకు చెమటలు కక్కుతూ ఆరిపోయే ఆశాజ్యోతులను ఎగదోసుకుంటట పిచ్చికుక్కల్లా ఆఫీసుల వెంబడి తిరగాల్సిన ఖర్మ ఉండేనా?

అసలు ఏ ఉద్యోగానికీ ఎక్స్‌పీరియన్స్ కనీసం మూడేళ్ళు ఉండాలిట. అసలు ఉద్యోగమే లేందే అనుభవం ఎక్కడుంటుంది?

కాలుగాలిన పిల్లిలా, బోనులో పడ్డ ఎలుకల ఇంట్లో తిరుగుతూ ఉండలేక చివరకు పేపర్ బోయ్‌గా చేరాను నాన్నకు తెలియకుండా. నెలకు వందరూపాయలు. రెండో రోజే తెలిసిపోయింది నాన్నకు. వాళ్ళ ఆఫీసుకు పేపరివ్వటానికి వెళ్ళాను. ఆఫీసు బయటే ఉన్నాడు నాన్న.

అద్దె సైకిలు దిగి పేపర్ల కట్ట నుండి పేపరు లాగి ఆఫీసు మెట్లు ఎక్కుతూ ...

'ప్రసాద్...' కంఠం రుద్ధమవుతుండగా దీనంగా అన్నాడు.

ఒక్కక్షణం అలా నిలుచుండి పోయాను. అయినా మరుక్షణంలోనే తెప్పరిల్లుకుని పేపర్ ఆయన చేతుల్లో పడేసి గిరుక్కున తిరిగి సైకిలేక్కేశాను.

ఆ రాత్రి నాన్న అన్నం తినలేదు. కుక్కిమంచంలో అలా కూర్చుండి పోయాడు.

''నాన్నా!''

తలెత్తి నాకేసి చూశాడు. దెబ్బతిన్న కుక్కపిల్ల చూపుల్లా ఉన్నాయి.

కాళ్ళ దగ్గరగా నేల మీద కూర్చున్నాను ఆయన ఒళ్ళో చేతులువేసి తల వాల్చుకుని 'నన్ను క్షమించు' అన్నాను.

''ఇంట్లో ఇలా ఉండిపోతే పిచ్చెక్కి పోయేలా ఉంది. సోమరిగా అయిపోతాను, నాన్నా! అందుకని ఏదో ఒకటి. అయినా ఇందులో అవమానం ఏముంది? బి. ఎ. చదివి అన్న ఫీలింగ్ ఒక్కటే! ఏ దయినా ఉద్యోగం రాకపోతుందా? లేచి అన్నం తినవూ?''


మారు మాటాడకుండా లేచి వెళ్ళి కంచం ముందు కూర్చున్నా డాయన. నాకు తెలుసు. నోరు విప్పితే దుఃఖం వచ్చేలా ఉంది ఆయనకు అని.

ఆ సాయంత్రం వీక్లీలు ఇవ్వటానికి బయలు దేరాను. అప్పుడే చూశాను అక్కయ్యని వి. ఎల్. డబ్ల్యు. ఇంట్లో నన్నూ చూసింది. కాని, క్షణంలో ముఖం తిప్పుకుంది.

ఎలా ఇంటికి చేరానో నాకే తెలియదు. అక్కయ్య రాకకోసం కాచుకున్నాను. అలా ఉన్న క్షణంలో చప్పున దాని మాటలు ... ఆ రోజుని గుర్తుకొచ్చాయి.

'చేతనయితే నాకు పెళ్ళిచేయమని చెప్పు.'

నీరుగారిపోయాను. ఇప్పు డడిగినా తను ఆ జవాబే ఇస్తుంది. ఇంటికి వచ్చిన అక్కయ్యను చూసీ చూడనట్టు ఉండిపోయాను. తనే మాత్రం జంకు ఫీలవలేదు. ఆ రాత్రికి పిల్లలందరూ నిద్రపోయాక



అమ్మా, నాన్నా భోంచేస్తుంటే వెళ్ళి పక్కనే కూర్చున్నాను.

''నాన్నా! అక్కయ్యకు పెళ్ళిచేస్తే బాగుంటుంది.'' నా మాటలు నాకే ఎబ్బెట్టుగా ఉన్నాయి.

ఆశ్చర్యంగా చూశాడు నాన్న.

''బానే ఉంటుంది. కాని, ఏం పెట్టి చేస్తాంరా. మన కొచ్చేది రెండు పూటలా తిండికే చాలటంలేదు. పెళ్ళంటే మాటలా.''

''ఎక్కడయినా అప్పు తెచ్చి ...''

ఫక్కున నవ్వాడు నాన్న. పొరపోయింది, కాసేపు గుక్క తిప్పుకోలేక.

''ఒరే ... ఒరే ... పిచ్చి ప్రసాదూ! మన కెవ్రరా అప్పులిచ్చేది. ఏముందని చూసి ఇస్తారు. ఇల్లా? భూమా? ముగింపు కొచ్చిన నా ఉద్యోగం చూశా? ఇంకా రాని, ఎప్పుడొస్తుందో తెలీని ... నీ ఉద్యోగం చూశా ... దాని కా గీత ఉందో, లేదో?''

''కాని అక్కయ్య ...'' అంటూ ఆగిపోయాను, గుమ్మంలో నుంచుని నాకేసే చూస్తున్న అక్కయ్యని చూసి.

''కానీ చూద్దాం. నీ కేదయినా ఉద్యోగం వస్తే... ఆ ఆసరా మీద అప్పో, సప్పో చేసి.''

అక్కడినుండి లేచి వచ్చేశాను. గిరుక్కున వెను తిరిగింది అక్కయ్య.

నా పక్కదగ్గరకు వెళ్ళబోతూ తన పక్కమీ దున్న అక్కయ్యకేసి చూశాను. నన్నే చూస్తోంది.

''నీకు ఉద్యోగం వచ్చేసరికి నే ను ముసలిదా న్నవుతాను. ఆ తరవాత పెళ్ళి అవసరమే ఉండదు.'' చీత్కారంగా అంటూ దుప్పటి ముసుగేసుకుని విసు రుగా పక్కకి తిరుక్కుంది.

చ. ఎంత అసహ్యంగా మాట్లాడుతోంది. సిగ్గూ, బిడియం లేదు. అవి కలిగే వయసు దాటి పోయిందా? లేక పరిస్థితులు దాన్నలా చేశాయా? మొండిదవుతోంది. రాటుదేరుతోంది. కారణం ... కారణం?

ఆలోచనల్లో పడి ఎప్పుడో నిద్ర పోయాను. ఆ తరవాత ఒక రోజు. పేపర్ ఏజెంట్ అడిగాడు.

''ఆ వి. ఎల్, డబ్ల్యు.తో తిరిగేది మీ అక్కయ్యే నటగా?'' ఏమని చెప్పేది. అవుననా, కాదనా? నా నవ నాడులూ అవమానంతో క్రుంగి పోయినట్టయి తల వంచేశాను. నా పరిస్థితి గమనించినట్టున్నాడు.

''సరె. సరె. పోయి పని చూసుకో'' అన్నాడు.

ఆ రాత్రి అక్కయ్యను ఒంటరిగా పట్టుకుని నోటి కొచ్చినట్టు అడిగాను. తిట్టాను. నేను అంటున్నంత సే పూ మెదలకుండా ఉండి పోయింది నవ్వుతూ, నన్నే చూస్తూ. ''అయిపోయిందా?'' అంది ఆఖరున.

''హు. నీకు సిగ్గూ, బిడియం లేదు'' అన్నాను.

''ఒరే! పిచ్చి సన్నాసీ! యౌవనంలో విరబూస్తున్న కోరికల మహోధృత ప్రవాహానికి ఆనకట్టలు వేయాలి రా. పెళ్ళి అనే ఆనకట్ట వేయనప్పుడు ఆ ప్రవాహం ముంచక తప్పదు. సరిగ్గా ఇప్పు డలాంటి ప్రవాహం లోనే ఉన్నాను నేను. నా వయసెంత తెలుసా? నీ కన్నా మూడేళ్ళు పెద్దదాన్ని. నీకుఇరవై మూడేమో! వసంతకాలం, వర్షాకాలం ప్రతి యేడూ వస్తూనే ఉంటాయి. కాని వయసు తిరిగి రాదురా. కొన్ని అవసరాలు తీరక పోయినా బ్రతకగలం. కాని, కొన్ని తీర్చుకోలేకపోతే బ్రతకలేం. మీ రందరూ కలిసికూడా తీర్చలేని నా అవసరం నేను తీర్చుకుంటున్నాను.''

''ఇలా అవినీతిగా బ్రతుకుతూనా?''

''శుష్కమయిన నీతుల్ని నలుగురిలో భయం వల్లనో... సిగ్గువల్లనో బాహ్యంగా ప్రదర్శిస్తున్నట్టు అభినయించినా అంతరాంతరాల్లో అవి తిరగబడతాయి. అవసరమయినవన్నీ తీరుతున్నంతవరకూ అందరూ నీతిని కనబరుస్తూనే ఉంటారు...''

''ఉపన్యాసాలివ్వటం నేర్చుకున్నావు. నీవు చేస్తున్న పని ఎంత తలవంపులు తెచ్చేదో, ఇంట్లో తెలిస్తే వాళ్ళేమవుతారో ఆలోచించావా...''

''ఇన్నేళ్ళొచ్చాయి కదా పెళ్ళంటూ చేయలేకపోతే నే నేమవుతానో వాళ్ళు ఆలోచించారా?''

''చేయడానికి శక్తి లేకేగా...''

''ఇంతమందిని కని పారేయడానికి శక్తి మాత్రం ఉంది.''

'' ఛీ నీతో మాట్లాట్టం నాదే బుద్ధి తక్కువ.''

''తెలుసుకున్నావుగా... నీ పరీక్షలకు ఫీజులు నేను సంపాదించిందేనోయ్.''

''కాదు''! గట్టిగా అరిచాను.

''నీకేం తెలుసు. లేసులు అమ్మానని, ఎంబ్రాయి డరీలు కుట్టానంటే ఇచ్చానని ఇస్తే నాన్న నీకు పంపారు. వాటికి వందలు వందలు వచ్చేట్లయితే అందరూ ఆ పనే చేసేవాళ్ళు.''

నా రక్తం ఉడికిపోసాగింది. ఛీ. . . ఛీ. . . ఓవరికు ఇలాంటి డబ్బుతో... నిస్తేజంగా నిలబడి పోయిన నన్ను నిర్లక్ష్యంగా చూస్తూ వెళ్ళిపోయింది. దాని పాదాలు కర్కశంగా నా గుండెలు తొక్కేసి పోతున్నట్టు... ఆ రాత్రి నిద్రపట్టలేదు నాకు... అక్కయ్య మాటల్లో భయంకరమయిన నిజాలు లేకపోలేదు.

ఆ మరుదినం అన్నాను ''అక్కయ్యా! నీ నడవడిక మార్చుకో. నా తల తాకట్టు పెట్టి నీ పెళ్ళి చేయిస్తాను.''

పడి పడి నవ్వింది. గుక్క తిప్పుకో లేనంతగా కళ్ళలో నీళ్ళొచ్చేంతగా.

''నీ తల. నీ తలఎవ్రరా తాకట్టు పెట్టుకొనేది?'' అలా నవ్వుతూనే ఉంది. నాకు కంపరం పుట్టింది. కోపం వచ్చింది.

''ఎందుకలా దెయ్యంలా నవ్వుతావ్. మేం వీధిలో తలెత్తుకు తిరగాలా? లేదా?'' అసహ్యించుకున్నట్టు అన్నాను.

''ఒరే నీవు అసహ్యించుకుంటున్న ఈ పనులు చేస్తున్న వాళ్ళందరూ బాహాటంగానే తల ఎగరేస్తూ తిరుగుతున్నారు. మధ్య నువ్వు తలెత్తుకునికూడా తిరగలేకపోవడానికి ఏముంది? చూడు. ప్రసాదూ! నా ఆశలు, నా కోరికలు, నా జీవితం నావి. మీరు తీర్చలేరు. పెళ్ళి చేసినా నాన్నలాగే ఏ బంట్రోతుకో, ఏ మూడో వాడికో ఇస్తారు. దినం దినం చస్తూ నేను బతక లేను. నె నిలాగే ఉంటాను. మీ ఇష్టం.''

''ఆ వి. ఎల్. డబ్ల్యు. పెళ్ళి చేసుకుంటాడా నిన్ను?''

''అతడికి ఇద్దరు పిల్లలు.'' నిర్లిప్తంగా అంది.

''వాడు వదిలేస్తే.''

''లోకం గొడ్డు పోలేదు.''

'' ఛీ. . .''

''నీవు వంద సార్లు ఛీ కొట్టినా. వేలసార్లు ఛా' అన్నా నాకు అంటదు. నేను మారను. మారలేను. మనిషై పుట్టిందానికి నాకు జీవితాన్ని అనుభవించా లని ఉంది. ఆనందాన్ని నా స్వంతం చేసుకోవాలని ఉంది. ఇక ఈ విషయం నా దగ్గర మాట్లాడకుండా ఉంటే మంచిది.''

• • •

ఇలా మా అక్కయ్య మారిపోయింది, సార్! అమ్మా నాన్నలుకూడా దాని ముందు మొత్తుకున్నారు. వృథా ప్రయత్నమే అయింది. ఆ తరవాత మేము అక్కయ్యను చేరనివ్వలేదు. తనూ ఈ దరిద్రపు కొంపలో ఉండలేనట్టు వెళ్ళిపోయింది.

తరవాత నాన్న ఆరోగ్యం బొత్తిగా పాడయి పోయింది. మందులుకూడా లేని అశక్తత. ఒకటి

రెండు సార్లు అక్కయ్య చూడటాని కని వచ్చి డబ్బు లివ్వబోయిందట. నేను చావనయినా చస్తాను కానీ, నీ పాపిష్టి సొమ్ము వద్దన్నాడు నాన్న. చివరకు మా అమ్మకూడా. సార్! వినడానికి కఠినంగానే ఉంటుంది. "నేను ముండ మోసే దానికయినా సిద్ధంగా ఉన్నానే! కన్న కూతురు ఒళ్ళమ్ముకు తెచ్చిన డబ్బుతో మందు కాదే పొయ్యటం. విషం. విషం. ఆ విషం మింగటం కన్నా ఇలా... ఇలా పోయినా నాకు తృప్తే"అంటున్న అమ్మను చూసి ఏడుపు నాపుకోలేక పోయాను, సార్!

కోరుకున్న దాని కోసం హీనస్థితికి దిగజారాల్సి ఉంటే ఆ కోరికనే చంపుకునే మనస్థైర్యం నా కిమ్మని ఆ భగవంతుణ్ణి కోరు కుంటాను. కష్టాలు కాలుతున్న దీనావస్థలో సైతం నా తమ్ముళ్ళు మా అక్కయ్య దగ్గరకు పరుగెత్త లేదు. అదే అదే, సార్! యోగ్యంగానే బ్రతుకుతాను, కాకుంటే చస్తాను. నాన్నను చచ్చిపోవడాని కయినా సరేనని మొండిగా నిలబడ్డ అమ్మ. అన్నానికి మొహం వాచినా అన్నయ్య తెచ్చేవరకు ఆగే నా చెల్లి, తమ్ముళ్ళు. వీళ్ళే... వీళ్ళే, సార్! నా వూపిరి. నా బ్రతుకు. నా జీవం. నా లక్ష్యం. నాకు గర్వ కారణంకూడా!


"సార్! కుక్కలు కూడా బ్రతుకుతాయ్, ఎంగిలి కూడు తింటూ, దొంగతిండ్లు మరుగుతూ. నక్కలూ బ్రతుకుతాయి, ఎదుటి వాటిని వంచిస్తూ. అంత కన్నా క్రూరమృగాలూ బ్రతుకుతూనే ఉన్నాయి. ఎదుటి వాళ్ళను చంపి తమ పొట్టలు నింపుకుంటూ, తమకండలు పెంచుకుంటూ. కాని, మనం మనుష్యులం కదా! సార్, ఎంగిలికూడు తినకుండా, దొంగతిండ్లకు ఆశించకుండా, ఎదుటి వాళ్ళను మోసం చేయకుండా మరొకణ్ణి చంపకుండా మన కడుపులు నింపుకుని మన వాళ్ళను పోషించుకొనే అవకాశాలు ఉన్నాయి కదా. డబ్బే అన్నిటికీ మూలం. కాని, అదిచ్చే సుఖం కోసం అడ్డదారుల నయినిచటం అనుసరణీయమే నంటారా? ఒకరిని వంచించి, మరొకరిని మోసగించి మనం వేలు సంపాదించినా కష్టపడి సంపాయించిన ఒక్క రూపాయి ఇచ్చే తృప్తి నిస్తుందా, సార్! తాత్కాలికంగా సుఖాలు పొందవచ్చు. కాని ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక అన్యాయం మనల్ని తిప్పికొట్టి నప్పుడు, ఎవరో ఒకరి ఉసురు తగిలినప్పుడు మన సాక్షి అనే కోర్టులో ముద్దాయిలుగా నిలచినప్పుడు... ఆ బాధ ఊహించలేం, సార్!

ఇప్పటికిప్పుడు మీ బాగ్ నేను తీసుకుపోయి ఉంటే ఆ డబ్బు ఇచ్చే కొన్నిరోజుల సుఖంకోసం నా జీవితమంతా నన్ను నేనే అసహ్యించుకుంటూ బ్రతకాల్సి వచ్చేది. మీ రిచ్చిన బహుమతే తీసు కుంటా ననుకోండి. అదిచ్చే సుఖం వల్ల రోజూ ఎవరేమి ఇస్తారా అనే యాచకుడిగా మారిపోనూ వచ్చు. నా కీ జీవితం చాలు,సార్! భగవంతుడి దయ వలన నాకే దయినా మంచి ఉద్యోగం వస్తే నా వాళ్ళను మరింత బాగా సుఖపెట్టడానికి ప్రయత్నిస్తాను. తన సహాయం తీసుకోనందుకు, తనను దూరం చేసినందుకు కసి పెంచుకున్న మా అక్కయ్య నన్ను ఎప్పటికప్పుడు ఇలా అవమానిస్తూ ఉంటుంది. నా దారిద్ర్యం మీద దెబ్బతీస్తూ తనెంత ఉన్నత స్థితిలో ఉందో ప్రదర్శించుకోటంలో గర్వంగా ఫీలవుతూ ఉంటుంది. కాని ... కాని ... ఆమె మీద, కోపంకన్నా జాలే ఎక్కువ నాకు. వ్యసనాలు పాకుడు రాళ్ళ వంటివి. అడుగు వేశామో అధః పాతాళానికి త్రోసేస్తాయి. అలాంటి రోజు అక్కయ్యకూ వస్తుంది. అప్పుడు ... అప్పుడు తనకు చేయి అందివ్వటానికి సోదరుడుగా నేనుసిద్ధంగానేఉంటాను, సార్!"

అతని కంఠం బొంగురుపోయింది. నిండుకున్న కన్నీళ్ళని చేతి వేళ్ళతో నొక్కి ... కన్నులు నులుమేసి అటూ ఇటూ చూసింది.

"క్షమించండి, సార్! చాలా చీకటయిపోయింది. భోజనాల వేళ అవుతుంది. పిల్లలు నాకోసంచూస్తూ గుమ్మంలోనే ఉంటారు, సార్! నే వెడతాను ..." చప్పున లేచి నిలబడి ... బట్టలు దులుపుకుని ... అరిచేతులను రెండింటినీకలుపుతూ "నమస్తే,సార్!" అంటూ రయ్యి మని వెళ్ళిపోయాడు ప్రసాద్.

చుట్టు రంగురంగుల దీపాలు, దీపాలవెలుగులో అందమైన క్రోటన్ మొక్కలు, వాటి నంటిపెట్టు



కునే వాటి క్రీనీడలు ... ఓహ్ అప్పుడె నాదృష్టిలో పడ్డాయి. అప్పటిదాకా సినిమా చూస్తున్నట్టుగానో, కథ వింటున్నట్టుగానో అలా కూర్చుండి పోయిన నేను ఆ తరవాత కూడా చాలసేపు అలాగే ఉండి పోయాను లేవకుండా.

నా ప్రయత్నం లేకుండానే నా మనసు నా జీవితాన్ని ప్రసాద్ జీవితంతో బేరీజు వేస్తోంది. నిజానికి నాతో పోల్చుకోడానికి ఏ మాత్రం అర్హత లేనివాడు అయినా ... అయినా ... ఇవాళ.... నా అంతరాంతరాల్లో ఏదో అలజడి. ఒకవిధంగా అంతరంగ మథనం. నేను ... నేను ... డబ్బు ... డబ్బు ... అంటూ పరుగులు తీస్తున్నాను, నీతిని అమ్ముకుంటూ ... అవినీతిని పెంచుకుంటూ ... ఎంతకాలం? ఎంతకాలమిలా? ఈ వ్యామోహంలో మునిగి చివరకు ఎక్కడ తేలబోతాను నేను.

ఇప్పటివరకు నేను సంపాదించిన డబ్బుతో నాకు పుట్టబోయే పిల్లలు, వాళ్ళ పిల్లలు కాళ్ళు కదపక్కర లేకుండా జరుపుకోగలరు. మరింకా ... ఇంకా ... నే నెందుకు లక్షలకు ఆశిస్తూ ... వెర్రి పరుగులు తీస్తూ ... చివరకు భార్యను కూడా ... చివరకు ఈ డబ్బునా మూట కట్టుకు పోతాను. కట్టుకు పోగలనా? ... ఈ చివరి ఆలోచనతో నా శరీరం జలదరించింది. గట్టిగా తలపట్టుకున్నాను.

నా కళ్ళముందు సర్వరుగా తటస్థపడిన ఆ ప్రసాదు, వాళ్ళ అక్కయ్య, వాళ్ళ కుటుంబం గిర్రున తిరుగుతున్నట్టు ఉంది.

ప్రసాద్ మాటలు ... అతని మనస్థయిర్యం .. అతని ఆత్మాభిమానం, అతడి మంచితనం ... నీతి ...

ఓహ్...ప్రసాద్...ప్రసాద్...అతడి రూపం నా కళ్ళముందు పెరిగి ... పెరిగి నేను తలఎత్తిచూసినా కానరా నంత ఎత్తుకు ఎదిగిన మనిషేనా? కాదు. కాదు. అతని వ్యక్తిత్వం.

మహోన్నతమయిన ఆ వ్యక్తిత్వం ముందు లక్షాధికారినయిన నేను అల్పప్రాణిలా ... అణువులా ...

న్యాయాన్యాయాలకు, నీతి అవినీతులకు తులా దండమనే దొకటుంటే.. అందులో నేనూ, ప్రసాద్ నిలబడితే ...

నేనున్న పళ్ళెం అంతరిక్షంలోకి పోదూ ... నా లక్షలు ... నాహోదా అంతా పూడ్చి నా పళ్ళెంలో వేసినా న్యాయం, నీతి కలిసిన పళ్ళెంలో నిలబడ్డ ప్రసాద్ కదులుతాడా?! పిసరంతా కూడా అతడి పళ్ళెం కదిలించలేని నేను...నా లక్షలు, నా హోదా ... ఛీ ...ఛీ ...

"ప్రసాద్! నీ వెంత గొప్పవాడివి ..."

నెమ్మదిగా లేచి నిలబడ్డాను. ఇక అక్కడ ఉండా లని లేదు నాకు. అంతేకాదు ట్రెయిన్ దగ్గరకు వెళ్ళాలని ... నేను మధ్యాహ్నం నుండీ ఎదురుచూసిన వ్యక్తిని కలుసుకోవాలని అసలే లేదు.

"వెళ్ళాలి వెళ్ళాలి .... ఈ చీకట్లోంచి వెలుగు రేఖల్లోకి ... ఈ బుర గుంటలోంచి సెలయేటిలోకి.

"ప్రసాద్ థ్యాంక్స్ ఎ లాట్" అనుకుంటూ ఇల్లుచేర్చే బస్సుకోసం బయలుదేరాను. *